
క్లుప్తంగా

'స్పందన'కు 12 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 12 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్లి శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. వినతుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చేతన్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పౌర్ణమి పూజలు


అలంకరణలో శివలింగం

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఫాల్గుణ మాస పౌర్ణమి పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి స్వామికి పంచామృతాభిషేకాలు, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన కార్యక్రమం జరుగుతాయన్నారు. షిర్డీసాయి భక్తురాలు లక్ష్మి నేతృత్వంలో స్వయంగా అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. భక్తులు పాల్గొనాలని అర్చకులు కోరారు.

11న వెంకన్న తీర్థం


పందిరి రాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు

కంచరపాలెం: స్థానిక తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఈ నెల 11న జరగనున్న వేంకటేశ్వర తీర్థ మహోత్సవానికి సోమవారం పందిరి రాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు చామర్తి జగనాథశర్మ, శంకరశర్మ నేతృత్వంలో ఆలయ చైర్మన్ గంటా కామరాజు, గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, యశోద దంపతులు పందిరి రాటకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ పోస్టర్‌ను వాసుదేవరావు, కామరాజు, పట్టిమి రాజు ఆవిష్కరించారు. ఈ మేరకు ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరిస్తున్నారు. ఈ నెల 18న ఆలయం వద్ద అన్నదానం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు పైడిమాంబ జాతర

ఆరిలోవ: పద్నాలుగు గ్రామాల ఇలవేల్పు పైడిమాంబ అమ్మవారి జాతర మంగళవారం జరగనుంది. జాతీయ రహదారిని ఆనుకుని డెయిరీ ఫారం వద్ద కొలువుదీరిన అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గత నెల 27న అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. చాటింపు నుంచి రోజు నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేస్తున్నారు. ఆలయం ప్రాంగణంలో నిత్యం భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం ప్రధాన జాతర సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఎన్నికల్లో లబ్ధి కోసమే సమ్మిట్

సీతంపేట: ఇటీవల జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రూ.13 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని ఊదర గొడుతున్నారని, అందులో పది శాతం చూపించిన చాలని 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందడానికి, రణస్థలంలో పవన్‌కల్యాణ్ సభకు పోటీగా సమ్మిట్ పెట్టారని ఆరోపించారు. అది అయిపోయిన వెంటనే ఇప్పటంలో ఇళ్లను కూల్చివేయడం ప్రారంభించారన్నారు. జనసేన నాయకులు ఉషాకిరణ్, బంటు రవి, రూప పాల్గొన్నారు.

స్వచ్ఛతకు తూట్లు


80 ఫీట్ రోడ్డులో బహిరంగ మల విసర్జన జరుగుతున్న ప్రాంతం

- ఓడీఎఫ్ అమలును మరచిన యంత్రాంగం
- స్థానికులు యథేచ్ఛగా మల, మూత్ర విసర్జనలు

సీతంపేట: బహిరంగ మల విసర్జన రహిత నగరంగా(ఓడీఎఫ్) మహా విశాఖను గతంలో ప్రకటించారు. కాలక్రమేణా ఓడీఎఫ్ అమలును యంత్రాంగం మరిచింది. దీంతో స్వచ్ఛ విశాఖ లక్ష్యం నీరుగారుతోంది. జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట కనకమ్మ ఆలయం వద్ద సులాభ్ కాంప్లెక్సు నుంచి రెల్లి వీధి వరకు ఉన్న 80 ఫీట్ రోడ్ ప్రాంతంలో యథేచ్ఛగా పగలు, రాత్రి అనే తేడా లేకుండా బహిరంగ మల, మూత్ర విసర్జన జరుగుతోంది. 80 ఫీట్ రోడ్‌లో డ్రెయిన్‌కు ఆనుకొని పదుల సంఖ్యలో వాహనాలు పార్క్‌చేస్తున్నారు. అవి ఎవరివో తెలియవు. ఎక్కడ నుంచి తెచ్చారో తెలియదు. వాటి యజమానులెవరో, అసలువో, దొంగతనంగా తెచ్చి వదిలిపెట్టారో తెలియని పరిస్థితి. నెలల తరబడి రోడ్డుపై దుమ్ముపట్టి ఉంటున్నా.. పోలీసులు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోరు. ఈ వాహనాల పార్కింగే బహిరంగ మల విసర్జన, ట్రాఫిక్ సమస్యలు, రహదారి ఆక్రమణలకు కారణమవుతోంది.

అపరిశుభ్రత.. దుర్వాసన

సామాజిక స్పృహ కరువైన కొంతమంది వాహనాల వెనుక కూర్చొని మల విసర్జనకు పాల్పడుతూ, ఓడీఎఫ్‌కు తూట్లు పొడుస్తున్నారు. పక్కనే సులాభ్ కాంప్లెక్సు ఉన్నా.. రోడ్డుపైనే బహిరంగ మల, మూత్ర విసర్జనకు పాల్పడటం చుట్టుపక్కల వారికి రోత పుట్టిస్తోంది. దుర్వాసన, అపరిశుభ్ర పరిసరాలతో నివాసితులు ఇబ్బంది పడుతున్నారు. ఇక వర్షం పడితే ఆ మార్గంలో కాలు మోపలేని పరిస్థితి. బహిరంగ విసర్జనకు ఎలా అడ్డుకట్టవేయాలో తెలియక స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓడీఎఫ్ తనిఖీలకు బృందాలు వచ్చే సమయంలో మాత్రం అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించి నియంత్రిస్తున్నారు. మిగతా రోజుల్లో పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.


సీతంపేట - రెల్లి వీధి 80 ఫీట్ రోడ్డులో పార్క్‌చేసి వదిలేసిన వాహనాలు

పారిశుధ్యానికి అడ్డంకి..

సీతంపేట– రెల్లి వీధి 80 ఫీట్ రోడ్‌లో నెలల తరబడి వాహనాలు నిలిపి ఉంచడంతో రోడ్డు శుభ్రపరచడానికి పారిశుధ్య సిబ్బందికి సవాలుగా మారింది. ఒక పక్క బహిరంగ మల విసర్జన.. మరో వైపు నిలిపి ఉంచిన వాహనాల వద్ద పేరుకుపోతున్న చెత్త.. ఈ రెండింటిని శుభ్రం చేసేందుకు తంటాలు పడుతున్నారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వాహనాలు తొలగించాలని టౌన్ ప్లానింగ్ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినా.. ప్రయోజనం లేకుండా పోయింది. సంబంధిత అధికారులు పరిశీలించి బహిరంగ మల విసర్జనకు అడ్డుకట్ట వేసి, వాహనాలను తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

వాహనాల తొలగింపుతో సమస్య పరిష్కారం

సీతంపేట – రెల్లి వీధి 80 ఫీట్ రోడ్‌లో వాహనాలు పార్క్‌చేసి ఉంటున్నాయి. కనీసం రోడ్డు, డ్రెయిన్ శుభ్రం చేయడానికి కూడా వీలు ఉండటం లేదు. సులాభ్ కాంప్లెక్సు ఉన్నా.. వాహనాల వెనుక బహిరంగ విసర్జనకు పాల్పడుతున్నారు. వాటిని తొలగించాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందికి చెప్పాం. అప్పుడే ఈ సమస్య పరిష్కారమవుతుంది.

– సింహాచలం నాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, 25వ వార్డు

ప్రజా వినతుల పరిష్కారానికి ప్రాధాన్యం


అర్జీలను పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: ప్రజా వినతుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 05 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జెడ్సీ స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 02, పబ్లిక్ హెల్త్‌కు 01, రెవెన్యూ విభాగానికి 02 చొప్పున అందినట్లు ఆయన చెప్పారు. సత్వరమే వాటిని పరిష్కరించాలని జోనల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్–1, 2 టి.ఎస్.ఎస్.రాజు, ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వో బాబురావు, ఇంజినీరింగ్ ఈఈ టి.ప్రసన్నరెడ్డి, వాటర్ డీఈ భరణికుమార్, ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, సూపర్‌వైజర్ జనార్దన్, ఏపీడీ పద్మావతి, అపరంజిత, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మదర్సా విద్యార్థులకు బహుమతుల ప్రదానం


విద్యార్థికి మెమొంటో అందిస్తున్న హుస్సేన్ సాహెబ్, ఎండీ షరీఫ్

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ మస్జిద్ ఎ అక్సా ఆధ్వర్యంలో గల మదర్సా గుల్షనే టైబ విద్యార్థులకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. రైల్వే న్యూకాలనీలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి సుఖీభవ డైరెక్టర్ హుస్సేన్ సాహెబ్, గౌరవ అతిథి కో ఆప్షన్ మెంబర్ ఎండీ షరీఫ్‌లు మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. విద్యతోపాటు ప్రతి ఒక్కరూ ధార్మిక విద్యను కూడా అభ్యసించాలని సూచించారు. ధార్మిక విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతులు, మెమొంటోలను అందజేశారు.

రైల్వే పారిశుధ్య కార్మికులకు వితరణ

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి విశాఖ రైల్వే స్టేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులకు శానిటరీ నాప్‌కిన్లు అందజేశారు. వారోత్సవాల్లో భాగంగా ఈకార్వో ఆధ్వర్యంలో మహిళల హక్కులు, లింగసమానత్వం, పునరుత్పాదక హక్కులు, మహిళలపై జరుగుతున్న హింస వంటి అంశాలపై దృష్టి సారిస్తున్నట్లు పారిజాత సత్పతి తెలిపారు. వీటితోపాటు ఉత్తమ మహిళా ఉద్యోగి, ఉత్తమ విద్యార్థుల(రైల్వే ఉద్యోగుల్లో)ను గుర్తించి వారికి ప్రశంసాపత్రాలు, స్కాలర్‌షిప్స్ వంటివి అందజేయడం, టాలెంట్ హంట్, పేదలకు సహాయం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఈకార్వో సెక్రటరీ ప్రియాంక శ్రీదేవి, ఇతర ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు.


కార్మికురాలికి శానిటరీ నాప్‌కిన్లు అందిస్తున్న ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి

మూల్యాంకన కేంద్రం పరిశీలన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రశ్నాపత్రాల మూల్యాంకన కేంద్రాన్ని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సోమవారం ఉదయం సందర్శించారు. బీఈడీ మూడో సెమిస్టర్ ప్రశ్నపత్రాల మూల్యాంకనం జరుగుతున్న విధానాన్ని ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, అధికారులు పాల్గొన్నారు.

దుర్గంధం సమస్యను పరిష్కరించండి


సీతమ్మధార రైతుబజార్ పక్క రోడ్డులో చెత్త కుప్ప, పార్క్‌చేసిన వాహనాలు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్ వద్ద దుర్గంధం సమస్యను పరిష్కరించాలని ఆక్సిజన్ టవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆక్సిజన్ టవర్స్‌లో నిర్వహించిన ఓ సమావేశంలో పాల్గొన్న నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు దృష్టికి అసోసియేషన్ సెక్రటరీ దేవరాజ్‌రెడ్డితోపాటు ఇతర ప్రతినిధులు ఈ సమస్యను తీసుకెళ్లారు. సీతమ్మధార రైతుబజార్ పక్క రోడ్డులో చెత్తను తొలగించడం లేదని, బజారులోని కూరగాయల వ్యర్థాలను ఆక్సిజన్ టవర్స్ గోడ పక్కనే వేయడంతో దుర్గంధంతో ఉండలేకపోతున్నామని ప్రతినిధులు వాపోయారు. రైతుబజార్‌లో పక్కనున్న రోడ్డులో ద్విచక్ర వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటోందని వివరించారు. ఈ సమస్యపై తక్షణమే చర్యలు తీసుకువాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కె.కె.రాజు మాట్లాడుతూ జీవీఎంసీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పబ్లిక్ డిమాండ్

ఇబ్బందికరంగా వాహనాల పార్కింగ్


నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయం ముందు పార్క్‌చేసిన వాహనాలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రధాన ద్వారం వద్ద రోడ్డుపై ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలను పార్క్‌చేసి వదిలేస్తున్నారు. దీంతో పాదచారులు, ఇతర వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఆలయాన్ని ఆనుకుని కొందరు బడ్డీలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ముఖ్యంగా సోమవారాల్లో ఆలయంలోకి వెళ్లి బయటకు రావాలంటే వాహనాల పార్కింగ్ వల్ల ఇబ్బందిగా ఉంటోంది. సంబంధిత అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలి.

– కె.భార్గవ్, నక్కవానిపాలెం

సమన్వయంతో పథకాల అమలు

ఏయూ క్యాంపస్: ప్రభుత్వ పథకాల అమలులో సమన్వయం ఎంతో అవసరమని కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పూర్వ కార్యదర్శి అజయ్ ప్రకాష్ షానోయ్ అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నంలో డిజిటల్ గవర్నెన్స్–మేనేజ్‌మెంట్ అంశంపై ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులకు ఐదు రోజుల స్వల్పకాలిక శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణను కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పూర్వ కార్యదర్శి అజయ్ ప్రకాష్ షానోయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సాధారణ పౌరుడికి విభిన్న సేవలను సాంకేతిక విధానాలు ఏ విధంగా చేరువ చేస్తున్నాయో వివరించారు. ప్రపంచానికి అవసరమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించే సామర్థ్యం భారత్‌కు ఉందని స్పష్టమైందన్నారు. పారదర్శకతను పెంపొందించడానికి డిజిటల్ మౌలిక వసతులు ఉపయుక్తంగా నిలుస్తున్న విధానాన్ని తెలియజేశారు. ఐఐఎం విశాఖపట్నం సంచాలకుడు ఆచార్య ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల నిపుణులు ఐఐఎంవీ అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఆచార్య నీన పాండే, ఆచార్య శ్రీనివాస్ జోస్యుల తదితరులు పాల్గొన్నారు.


శిక్షణకు హాజరైన అధికారులతో ఐఐఎం సంచాలకుడు ఆచార్య చంద్రశేఖర్

మేధోశక్తి బలోపేతం తప్పనిసరి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

ఏయూక్యాంపస్: విద్యార్థులు తమ మేధోశక్తిని నిరంతరం మెరుగుపరుచుకోవడం తప్పనిసరని ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఉదయం ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో ఉన్నత విద్యా మండలి నిర్వహించిన జోనల్ స్థాయి క్విజ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞాపకశక్తికి పరీక్షగా క్విజ్ పోటీలు నిలుస్తాయన్నారు. విశ్లేషణాత్మక ఆలోచనలకు ఈ పోటీలు దోహదపడతాయని చెప్పారు. విద్యార్థులు తమ జ్ఞానాన్ని పెంచుకుంటూ, కాలాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ పోటీ పడాలన్నారు. కార్యక్రమ అధ్యక్షుడు ఆచార్య ఎ.నాగహనుమాన్ మాట్లాడుతూ 40 గ్రూపులుగా 80 మంది విద్యార్థులు పోటీలలో పాల్గొంటున్నారన్నారు. విద్యార్థులకు వర్సిటీ ప్రాంగణంలో వసతి, భోజన సదుపాయాలు కల్పించామన్నారు. ఉన్నత విద్యా మండలి అధికారి ఎ.ఆర్.నగేష్ మాట్లాడుతూ మూడు రీజియన్‌లుగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వీటిలో విజేతలకు రాష్ట్రస్థాయి పోటీలకు అవకాశం కల్పిస్తామన్నారు. నోడల్ ఆఫీసర్ శ్రీధర్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఎస్.హరనాథ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పరికరాల పంపిణీ


క్రీడా పరికరాలు అందిస్తున్న సర్కిల్ ఇండియా ప్రతినిధులు

ఆరిలోవ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తోటగరువు హైస్కూల్‌లో విద్యార్థులకు ఏరియా 9 లేడీస్ సర్కిల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. వాలీబాల్, స్కిప్పింగ్ రోప్స్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, షటిల్, టెన్నీకాయిట్ తదితర క్రీడా పరికరాలను హెచ్‌ఎం జి.కె.డి.భవాని సమక్షంలో విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ చైర్‌పర్సన్ శ్వేత జోషి, ప్రతినిధులు శుభ, హైమా, ఆస్తా బజాజ్, నిషాకుస్బు, భావన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంకు కానుకగా సీతంరాజు గెలుపు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా సోమవారం సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో పార్టీ నాయకుడు సతీష్‌వర్మ ఆధ్వర్యంలో రెసిడెన్సియల్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసింది. ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడారు. ఈ నెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించి, సీఎంకు కానుకగా ఇవ్వాలన్నారు. విశాఖ పరిపాలన రాజధానిలో మొదటి ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రాంబాబు, రాంనాథ్, గిరివర్మ, కాంటంరాజు, అప్పలరాజు, సెక్రటరీ దేవరాజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక.. ఏయూ మైదానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023లో పాల్గొని ఆకర్షితుడై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ ఏజీఎం బోని అప్పారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆక్సిజన్ టవర్స్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి సమక్షంలో చేరారు. ఆయనకు సుబ్బారెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని బోని అప్పారావు చెప్పారు. సీతంరాజు సుధాకర్‌ను గెలుపునకు కృషి చేస్తానన్నారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


శాంతిపురంలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్


49వ వార్డులో గ్రాడ్యుయేట్‌కు ఓటు ఎలా వేయాలో వివరిస్తున్న కార్పొరేటర్ శంకరరావు

సీతంపేట: నియోజకవర్గంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. సోమవారం 25వ వార్డు 132 సచివాలయం పరిధి శాంతిపురంలో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సానబోయిన సురేష్, స్వర్ణపూడి సత్యనారాయణ, గుడివాడ గౌరి, ఉప్పాడ సన్నీ, కోటేశ్వరరావు, రవి, వీరమ్మ, జయ, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా..

మద్రిపాలెం: జీవీఎంసీ 49వ వార్డు 282 సచివాలయ పరిధి ఏఎస్సార్ నగర్‌లో కార్పొరేటర్ అల్లు శంకరరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు.

- 50వ వార్డు మాధవధార పరిసర ప్రాంతాల్లో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ప్రచారం చేశారు. సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను అభ్యర్థించారు.


53వ వార్డులో కరపత్రాలు అందిస్తున్న కార్పొరేటర్ బర్కత్ అలీ, గుజ్జు వెంకటరెడ్డి

- 51వ వార్డు 287 సచివాలయం పరిధి రామన్‌కాలనీ, అంబేడ్కర్ కాలనీ 1, 2, 3 ప్రాంతాల్లో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పట్టభద్రులను కలిసి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.
- 53వ వార్డు 295 సచివాలయం పరిధి పార్వతీనగర్, జాకీర్ హుస్సేన్‌నగర్, గ్రీన్ గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ బర్కత్ అలీ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డితో కలిసి ప్రచారం చేశారు. గ్రాడ్యుయేట్లను కలిసి సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

విస్తృతంగా వాకర్స్ క్లబ్ కార్యక్రమాలు



మాట్లాడుతున్న డాక్టర్ రవీంద్ర

తాటిచెట్లపాలెం: మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఆధ్వర్యంలో సోమవారం నెల వారీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఇంటర్నేషనల్ వాకర్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.పి.రవీంద్ర, ఇంటర్నేషనల్ సెక్రటరీ వాకర్ కె.ద్వారకానాథ్ మాట్లాడుతూ పలు సూచనలిచ్చారు. వాకర్స్ క్లబ్ కార్యక్రమాలను విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో భాగంగా ప్రపంచ శాంతి కోసం మౌనం పాటించారు. రామానుజ సుధీర్ భూరి విరాళంతో వాకర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలను అతిథుల చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్లు ఆదిభట్ల రామకృష్ణ, మల్లా రామకృష్ణ, సెక్రటరీ లంకా వెంకట సుధాకర్, కోశాధికారి జనపరెడ్డి కూర్మారావు, జాలీ వాకర్ నానుపాత్రుని ప్రకాష్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడికి గాయాలు

మద్రిపాలెం: ఆటో ఢీకొని తల్లి, కుమారుడికి గాయాలైన ఘటన సోమవారం కంచరపాలెం పరిధిలో జరిగింది. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. కాన్వెంట్ జంక్షన్ నుంచి కంచరపాలెం మీదుగా ద్విచక్ర వాహనంపై జ్యోతీనగర్‌కు వస్తున్న భర్త, భార్య, కుమారుడిని ముత్యాలమ్మ గుడి దగ్గర న్యూకాలనీ నుంచి కంచరపాలెం వైపు వెళ్తున్న ఏస్ ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యాండ్ర మాధురి, ఆమె కుమారుడు ఐదేళ్ల నవ్‌నీత్‌సాయికి గాయాలయ్యాయి. బాబుకు ముక్కు, చెవి వెంబడి రక్తం కారడంతో అపస్మారక స్థితిలో ఉన్నాడు. ప్రస్తుతం చికిత్స అందిస్తున్నారు. మాధురి ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్వారకా పోలీసుల ఔదార్యం


వృద్ధుడు జగన్నాథంను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న కానిస్టేబుల్ వెంకటేష్

సీతమ్మధార: మతిస్థిమితం లేని ఓ వృద్ధుడిని ద్వారకా జోన్ పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించి తమ ఔదార్యం చూపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం సీఐ సింహాద్రినాయుడు నేతృత్వంలో పెట్రోలింగ్ చేస్తుండగా.. నిస్సహాయ స్థితిలో ఉన్న ఒక వృద్ధుడిని గుర్తించారు. అతడిని ప్రశ్నించగా మతిస్థిమితం సరిగ్గా లేదని తెలుసుకున్న కానిస్టేబుల్ వెంకటేష్ కొన్ని ఆనవాళ్ల గుర్తించి సూర్యాబాగ్‌లో ఉండే కుటుంబ సభ్యులకు అప్పగించి వివరాలు అడిగి తెలుసుకున్నాడు. సోమవారం ఉదయం 5.30 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో బయటకు వెళ్లిన వృద్ధుడు ఎడ్ల జగన్నాథం కనిపించకపోవడంతో రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో అతడి మనవరాలు కె.ఎస్.ప్రత్యూష ఫిర్యాదు చేశారు. నగర పోలీస్ కమిషనర్ వాట్సాప్ నంబర్‌కు ఒక సందేశం ఇవ్వడంతో పోలీసులు అప్రమత్తమై వృద్ధుడిని అతడి కొడుకు ఎడ్ల రవి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. సీఐ, సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు.